క్లుప్తంగా

బాల్య వివాహాలతో అనర్థాలు



బాల్య వివాహాలపై ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కృష్ణమంజరి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. బాల్య వివాహంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, పుస్తకాలు మోసే వయసులో పుస్తెల భారం వద్దని అన్నారు. అనంతరం మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. సూపర్‌వైజర్ హేమావతి, అంగన్‌వాడీ కార్యకర్త, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అంకితభావం పెంపు



బాలుర గురుకుల పాఠశాలలో భారత్‌స్కౌట్ విద్యార్థులు

సత్యవేడు: జ్యోతిరావుపూలే వెనుకబడిన తరగతులు సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో భారత్ స్కౌట్ ఏర్పాటు చేయడంతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, అంకితభావం పెరుగుతుందని ఎంఈఓ రవి అన్నారు. బుధవారం గురుకుల పాఠశాలలో భారత్ స్కౌట్ విద్యార్థులు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో జరిగే సేవా కార్యక్రమాల్లో పాఠశాల స్కౌట్ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో బీఎంసీ చైర్మన్ సురేష్, సురేష్‌కుమార్, మల్లికార్జున, రత్నకుమార్, కోఆప్షన్ సభ్యుడు దినకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో అరకొర నిధులు



ఉన్నం వాసుదేవనాయుడు

శ్రీకాళహస్తి: రాష్ట్రప్రభుత్వం 2025–26 సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అరకొరగానే నిధులు కేటాయింపు జరిగిందని, హామీలు పూర్తిగా విస్మరించారని ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేశారని విమర్శించారు. మహిళా సంక్షేమ పథకాలకు నిధులు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. బడ్జెట్‌లో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని తెలిపారు.

సత్యవేడు మండలం రాళ్లకుప్పంలో సాగులో ఉన్న పుచ్చ పంట



సత్యవేడు మండలంలో మల్చింగ్ విధానంలో సాగు చేసిన పుచ్చ పంటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ ఏఓ రాధారాణి



పుచ్చ సాగు .. లాభదాయకం

ఈ ఏడాది విస్తారంగా పుచ్చపంట సాగులోకి వచ్చింది. రైతులు కూడా ఈసారి పుచ్చ సాగుకే మొగ్గు చూపారు. అయితే పంట కూడా ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రావడం, మరోవైపు గిట్టుబాటు . ధర ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఆశించిన స్థాయిలో దిగుబడులు
- సబ్సిడీపై మల్చింగ్‌కు షీట్లు అందించిన ఉద్యానవనశాఖ
- డ్రిప్ సదుపాయం
- సాంకేతికత వినియోగం
- తక్కువ పెట్టుబడి
- పంట కొనుగోలుకు రైతుల పొలాల వద్దకే వస్తున్న వ్యాపారులు



పుచ్చ కాయలను లారీల్లోకి లోడ్ చేస్తున్న కూలీలు

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా పుచ్చసాగు చేశారు. ఉద్యానవన శాఖ అధికారుల సహకారం తోడవడంతో రైతులు ఆశించిన మేర దిగుబడులు పొందుతున్నారు. ముఖ్యంగా వరదయ్యపాళెం మండలంలోని వెంగారెడ్డికండ్రిగ, చెన్నవారిపాళెం, పెద్ద పాండూరు, పాదిరికుప్పం, శ్రీహరికోటకాలనీ, తొండూరు, ఎంజీనగర్, వరదయ్యపాళెం, రాళ్లకుప్పం, రాచపాళెం, అమాసరెడ్డికండ్రిగ, పెద్దఈటిపాకం ప్రాంతాల్లో పుచ్చ పంటను రైతులు సాగు చేస్తున్నారు.

పెట్టుబడి తక్కువ..

ప్రధానంగా మల్చింగ్ విధానంలో పండ్ల తోటలు సాగు చేస్తే చాలా వరకు పెట్టుబడి తగ్గుతుంది. ఆ దిశగా పుచ్చ పంటకు అదే పరిస్థితి వర్తిస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రధానంగా విత్తనం వేసిన వెంటనే కలుపు మొక్కలు ఏపుగా పెరుగుతాయి. కూలీలతో కలుపు మొక్కలు తీయించాలి. అయితే మల్చింగ్ విధానంలో పంట సాగు చేయడం వల్ల కలుపు మొక్కలు తొలగించే పరిస్థితి నుంచి రైతులకు విముక్తి లభిస్తుంది. అంతేకాక పురుగు మందుల పిచికారీ కూడా తక్కువ మోతాదులో వినియోగించవచ్చు. తక్కువ మంది కూలీలతో పంట సాగు పూర్తి చేయవచ్చు. దీంతో రైతులు మల్చింగ్ విధానంలో సాగుకే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.

మండలాల వారీగా పుచ్చ సాగు వివరాలు:

మండలం	పుచ్చ పంట సాగు (ఎకరాల్లో)
వరదయ్యపాళెం	150
బీఎన్‌కండ్రిగ	100
సత్యవేడు	650
కేవీబీపురం	550

ఎకరాకు 15 టన్నులకు పైగా దిగుబడి

పుచ్చ పంట సాగులో ఎకరా పంటకు 15 టన్నులకు పైగా దిగుబడి వస్తోంది. టన్ను రూ.10 వేలు నుంచి రూ.13 వేల వరకు ధర పలుకుతుండడంతో ఈ ఏడాది రైతుకు పుచ్చ పంట సాగుతో ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. కాయ నాణ్యతను బట్టి ధరలు ఉన్నాయి. ప్రస్తుత వేసవికి పుచ్చకాయలకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండడంతో వ్యాపారులు పొలాల వద్దకే క్యూ కడుతున్నారు.

మల్చింగ్ పద్ధతిలో సాగు..

అయితే ఈ ఏడాది పుచ్చ పంట సాగులో రైతులు సాంకేతికతను అందిపుచ్చుకున్నారు. సత్యవేడు నియోజకవర్గవ్యాప్తంగా 1,450 ఎకరాల్లో ఈ ఏడాది పుచ్చ పంటను సాగు చేశారు. అయితే ప్రధానంగా మల్చింగ్, డ్రిప్ పద్ధతిలో సాగు చేశారు. పాలథీన్ షీట్‌లను భూమిపై కప్పి పంటను సాగు చేసే విధానాన్ని మల్చింగ్ అంటారు. పంటకు నీటి సరఫరా కోసం డ్రిప్ పద్ధతిలో తుంపర్ల ద్వారా సాగు నీరు అందే విధంగా రైతులు సిద్ధం చేసుకున్నారు. సబ్సిడీపై మల్చింగ్ షీట్లు, డ్రిప్ పైపులు అందుబాటులోకి రావడంతో ఈ పద్ధతి వైపు రైతులు మొగ్గు చూపినట్లు సమాచారం.

రైతుల ఆసక్తి



పుచ్చ పంటను మల్చింగ్ విధానంలో సాగు చేసేందుకు రైతులు ఈ ఏడాది ప్రత్యేకంగా ఆసక్తి చూపారు. ఆ దిశగా సత్యవేడు నియోజకవర్గంలో 1450 ఎకరాల్లో మల్చింగ్ విధానం ద్వారా ఈ ఏడాది పుచ్చ పంటను సాగైంది. ఈ విధానంతో దిగుబడి ఎక్కువగా రావడంతో పాటు పెట్టుబడులు కూడా 40శాతం వరకు తక్కువ అయ్యాయి. హెక్టారుకు రూ.16 వేల సబ్సిడీ అందజేస్తాం. క్షేత్రస్థాయిలో రైతుల్లో అవగాహన కల్పించడానికి ప్రత్యేక కృషి చేస్తున్నాం.

– రాధారాణి, ఏఓ, ఉద్యానశాఖ, సత్యవేడు నియోజకవర్గం

కౌలు వేలంతో భారీ ఆదాయం

నారాయణవనం: నారాయణవనం మేజర్ గ్రామ పంచాయతీలో ఆదాయ వనరుల వార్షిక కౌలుకు బుధవారం నిర్వహించిన వేలం పాట ద్వారా రూ.9,21,800 ఆదాయం లభించినట్లు పంచాయతీ ఈఓ షణ్ముగం తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు కార్యాలయ ఆవరణలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి నిర్వహించిన వేలంలో టూరిస్ట్ బస్టాండ్ ద్వారా రూ.7.25 లక్షలు, దినసరి కూరగాయల మార్కెట్ ద్వారా రూ.60,800, జంతువధశాల ద్వారా రూ.23 వేలు, ఆటోస్టాండ్ ద్వారా రూ.1.13 లక్షలు ఆదాయం లభించిందని ఆయన అన్నారు. వారపు సంత వేలంలో ఒక్కరే పాల్గొనడంతో పాటను వాయిదా వేశామని తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి వేలంపాట ద్వారా కౌలుకు పొందిన వారిని వసూళ్లకు అనుమతిస్తామన్నారు.

స్టేషన్ నిర్వహణపై ఓపెన్ ఫోరం



విద్యార్థులకు పోలీస్ స్టేషన్ విధులపై అవగాహన కల్పిస్తున్న సీఐ మురళి

సత్యవేడు: పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాల నిర్వహణపై విద్యార్థినులకు సీఐ మురళి అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పుత్తూరు డీఎస్పీ రవికుమార్ సూచనలతో బుధవారం సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో శ్రీవిద్య ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే విధులు, పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. ఏ సమస్య వచ్చినా నిర్భయంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసేలా బాలికల మనోధైర్యం పెంచుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదుదారులు వచ్చినప్పుడు వెంటనే రిసెప్షన్ కౌంటర్ సిబ్బంది ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. బయోమెట్రిక్ ఆధారంగా మొబైల్‌లో నేరచరిత్ర తెలుసుకునే విధానాన్ని వివరించారు. న్యాయ విచారణ సమయంలో నేరస్తులను ఉంచే గదులను చూపించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. సెట్ కాన్ఫరెన్స్ ప్రయోజనాలను తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా 100కు ఫోన్ చేయాలన్నారు. మహిళల భద్రత కోసం పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ధరలు ప్రకటించి భూసేకరణ చేపట్టాలి



పెద్ద ఈటిపాకంలో గ్రామసభ నిర్వహిస్తున్న ఆర్డీఓ కిరణ్మయి

సత్యవేడు: భూముల ధరలు ప్రకటించి భూసేకరణ చేపట్టాలని పలువురు రైతులు కోరారు. బుధవారం మండలంలోని కొల్లడం, పెద్ద ఈటిపాకంలలో ఏపీఐఐసీ భూసేకరణ తొలిదశలో భాగంగా రైతుల భూముల వివరాలను సేకరించేందుకు సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. అందులో భాగంగా పెద్దఈటిపాకం, కొల్లడం గ్రామాల్లో భూసేకరణకు సంబంధించి రైతుల పాస్‌బుక్కులు, పట్టాలు, కొనుగోలు డాక్యుమెంట్లను పరిశీలించారు. డీకేటీ పట్టాల రైతుల వివరాలు సేకరించారు. కొల్లడం పరిధిలో 3.30 ఎకరాలు, పెద్ద ఈటిపాకం పరిధిలో 17.44 ఎకరాలకు సంబంధించి 24 మందికి చెందిన భూ రికార్డులను తనిఖీ చేశారు. పెద్దఈటిపాకం పరిధిలోని 158 సర్వేనంబరులో 3 ఎకరాలు భూమి ఉన్న రైతు ఎల్.అనిల్ రెడ్డి మాట్లాడుతూ తమ సొంత భూమిని ఇస్తున్నందుకు తమకు భూమి రేటు చెప్పాలని ఆర్డీఓని కోరారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రైతులకు మంచి ధర ఇస్తామని చెప్పగా.. మంచి ధర అంటే ఎంతో చెప్పాలని అడిగారు. రైతులకు అనుకూలంగా ఉండే ధరే ఉంటుందని ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు సత్యవేడు రాజశేఖర్, రాజేంద్ర(నాయుడుపేట), పద్మావతి(ఓజిలి), శరత్(తడ), డీఏఓ రవికుమార్(సూళ్లూరుపేట), మండల సర్వేయర్ చంద్రశేఖర్ కుమార్, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్, వీఆర్‌ఓలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండడం లేదు

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో రాత్రివేళ వైద్యులు ఉండడం లేదు
- సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏరియా ఆస్పత్రిగా స్థాయి పెంచండి
- అసెంబ్లీలో ప్రస్తావించిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాత్రివేళల్లో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని, ఆ కారణంగా పేద ప్రజలు వైద్యసేవలకు దూరమవుతూ ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. అంతేకాక నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల స్థాయి ఏరియా ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని కోరారు. ప్రధానంగా నియోజకవర్గ ప్రజలకు ఎంతో అవసరమైన సత్యవేడు సీహెచ్‌సీలో గర్భం దాల్చిన మహిళలకు వైద్యం అందించేందుకు గైనకాలజిస్టును నియమించాలని కోరారు. గైనకాలజిస్ట్ లేక ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఉందని విన్నవించారు. ఆంధ్ర–తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో ఉన్న సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు ప్రధానంగా వైద్య సౌకర్యాలు ఎంతో ముఖ్యమని, అందుకు కారణంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించే దిశగా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అటు శ్రీసిటీ ఇటు ఏపీఐఐసీ పరిధిలోని పలు పరిశ్రమల ఏర్పాటుతో రోజురోజుకు అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్న ఈ ప్రాంత ప్రజల అవసరాల కోసం సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏరియా ఆస్పత్రి స్థాయిని పెంచడం ఎంతో అవసరమన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో ఏ సమయంలో ప్రమాదం జరిగినా అత్యవసర వైద్యం అందించే దిశగా ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని కోరారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి



ఆటోస్టాండ్‌ను ప్రారంభిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న నంది సర్కిల్‌లో నందీశ్వర ఆటోస్టాండ్‌ను సీఐ వెంకటేశ్వర్లు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే పడిన తర్వాత టౌన్‌లోకి యాత్రికులు రావాలంటే కష్టంగా ఉండడం వల్ల ఈ ఆటోస్టాండ్ ప్రారంభించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, దేవస్థానానికి వచ్చే యాత్రికులకు అనుకూలమైన చార్జీలను తీసుకోవాలన్నారు. ప్రతి డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరి అని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, పట్టణ కార్యదర్శి గోపి, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వైఎస్ మణి, మురళి, వీధి విక్రయదారుల జిల్లా అధ్యక్షుడు జనార్దన్, లాజర్ బాషా, నందీశ్వర ఆటో యూనియన్ నాయకులు పాండు, గణేష్ మనోహర్, పుట్టయ్య, చిరు, జ్ఞానయ్య, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు

బైక్ మెకానిక్‌కు తీవ్రగాయాలు

సత్యవేడు: శ్రీసిటీ–మార్గంలోని చెరివి సబ్‌స్టేషన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్యవేడుకు చెందిన స్కూటర్ మెకానిక్ సురేష్ గాయాల పాలయ్యాడు. బుధవారం మధ్యాహ్నం సత్యవేడుకు చెందిన మెకానిక్ సురేష్ శ్రీసిటీకి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కంటైనర్ లారీ ఢీకొంది. శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశ్రామిక వాడలో మహిళ హత్య

తడ: మండలంలోని మాంబట్టు ఏపీఐఐసీ పారిశ్రామిక వాడలో ఓ వివాహిత(25)ను చంపి పడేసిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. జాతీయ రహదారి నుంచి మాంబట్టు సెజ్‌కు వెళ్లే దారిలో ఉన్న కొడూరు చెరువు వద్ద ఉదయం దుర్గంధం వస్తుండడంతో స్థానికుల సమాచారం మేరకు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, తడ ఎస్ఐ కొండపనాయుడు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గడ్డి పొదల చాటున ఉన్న కాలువలో వెల్లకిలా పడేసి, పైన కాలిన చెట్టు మొద్దును ఉంచి కప్పి పెట్టిన మహిళ మృత దేహాన్ని పోలీసులు గుర్తించి వెలికి తీశారు. చనిపోయి నాలుగు రోజులు కావడంతో శవం గుర్తు పట్టలేని విధంగా మారింది. కాలువలో పెద్దగా నీళ్లు లేకపోవడంతో ఆమెను చంపి కాలువలో పడేసి ఉండవచ్చని, కాలువ చుట్టూ గడ్డి పెరిగి ఉండడంతో దుర్గంధం వచ్చే వరకు బయటకు తెలియలేదని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహానికి సమీపంలో ఓ బ్యాగు, దుప్పటి, కట్‌షూ జత, రెండు జతల దుస్తులతోపాటు ఫేస్ క్రీం, టూత్ పేస్టు, బ్రష్‌లు, ప్లాస్టిక్ గాజులు, బొట్టు బిళ్లలు ఉన్నాయి. చుడీదార్ ధరించిన ఈమె ఎడమ చేతిపై ఇర్ఫాన్ పేరు మధ్యలో లవ్ గుర్తు తరువాత అనిత అని ఇంగ్లీషులో పచ్చబొట్టు ఉంది. కాలికి మెట్టెలు ఉండడంతో వివాహితగా భావిస్తున్నారు. శవం వద్ద లభించిన వస్తువులతోపాటు అక్కడ ఉన్న బట్టల షాపు బ్యాగుపై అడాస్‌పూర్, ఒడిశా అని ఉండడంతో ఆమెను ఒడిశావాసిగా భావించి, స్థానిక పరిశ్రమలు, హోటళ్లకు పోలీస్ సిబ్బంది సమాచారం అందించారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భార్యను మోసం చేసి..

- రెండో పెళ్లి చేసుకున్న ప్రబుద్ధుడు
- కటకటాల్లోకి నెట్టిన పోలీసులు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

కార్వేటినగరం: భార్యను మోసం చేసి రెండో వివాహం చేసుకున్న వ్యక్తి అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ బుధవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని టీకేఎం పేట దళితవాడకు చెందిన పి.కృష్ణయ్య కుమారుడు రవీంద్రబాబుకు 2013వ సంవత్సరంలో కార్వేటినగరం పెద్ద హరిజనవాడకు చెందిన వేలయ్య కుమార్తె భాగ్యలక్ష్మిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తన భార్యను మోసం చేసి టీకేఎం పేట గ్రామానికి చెందిన ఏలుమలై కుమార్తె అయిన కాంచన అనే అమ్మాయికి మాయ మాటలు చెప్పి ఆమెను కూడా డబ్బుల కోసం రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో మొదటి భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ చెప్పారు.

పూల సాగును ప్రోత్సహించండి



పూల తోటను పరిశీలిస్తున్న శ్రీనివాసప్రసాద్

నారాయణవనం: ఉద్యానవన పంటల సాగులో భాగంగా అత్యధిక లాభాలు వచ్చే పూల సాగును ప్రోత్సహించాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కొండలచెరువు, అరణ్యంకండ్రిగ పంచాయతీలలో సాగు చేసిన పూలతోటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా ఇదివరకే ఉద్యానవన పంట సాగుకు రైతులకు నగదును అందజేస్తున్నామని అన్నారు. పూలసాగులో పొలం దున్నకం, మొక్కల నాటు, సంరక్షణకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిధులను అందజేస్తున్నామని అన్నారు. రోజూ పని కల్పిస్తూ చేతి నిండా ఆదాయాన్ని వనగూర్చే పూల సాగుపై అవగాహన కల్పించి, సాగు విస్తీర్ణం పెంచేలా చూడాలని ఉపాధిహామీ క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సుకన్యం, భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాల పరిశీలన



విద్యార్థినితో పాఠం చదివిస్తున్న విద్యాధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం పెంపొందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తిరుపతి జిల్లా ఏఎంఓ శివశంకరయ్య సూచించారు. బుధవారం ఆయన రేణిగుంట మండలంలోని గురవరాజుపల్లి ఎస్టీ కాలనీ, వెదళ్లచెరువు ఎస్టీ కాలనీ పాఠశాలలను ఎంఈఓ రంగనాథయ్యతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వెదళ్లచెరువు ఎస్టీ కాలనీ స్కూల్‌లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు సరిగా చదవలేకపోవడంతో అభ్యసనా సామర్థ్యాలు చాలా వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఉపాధ్యాయులు తగిన ప్రణాళికలు రూపొందించి విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని సూచించారు.